B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 273 | ఆదివారం | 01-11-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



పైవేటుకు అప్పగిస్తారా?

- ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?:
- ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్
- బ్యాంకు ఆస్తుల విలువను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్నారని ఆరోపణ
- రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వస్తే నిబంధనలు మార్చడంపై ప్రశ్నలు
- ఉద్యోగుల ఆందోళనలను కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపాటు

2

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారు..



2

భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమయ్యాయి

దేశ విభజనకు కుట్ర చేస్తున్నాయి: ప్రధాని మోదీ

దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని, విపక్షాల కుట్రలను ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.



మన ప్రజాపక్షం,గుజరాత్

దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే దిమాగీ నక్సల్స్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోదీ సూచించారు. భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమై దేశంలో విభజనను ప్రోత్సహించాలని కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా అబద్ధాలను, వదంతులను వ్యాప్తి చేస్తూ అస్థిరతను సృష్టించే పనిలో నిమగ్నమయ్యాయని మండిపడ్డారు.ఉక్కుమనిషి, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనకు ఘన నివాళి అర్పించారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న పటేల్ భారీ విగ్రహం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ప్రధాని పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రతకు, భారతజాతి నిర్మాణానికి పటేల్ చేసిన సేవలను కొనియాడారు. దృఢమైన, సంపన్నమైన, సమర్థవంతమైన దేశ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని తన సందేశంలో పేర్కొన్నారు.పటేల్‌కు నివాళులు అర్పించిన తర్వాత ఏక్తానగర్‌లో నర్మదా మాత విగ్రహం నుంచి రెప్లికా గార్డెన్ వరకు సాయుధ దళాల పరేడ్ అట్టహాసంగా జరిగింది. దాదాపు 10 వేల మంది పోలీస్, పారామిలటరీ దళాలు ఈ కార్యక్రమంలో కవాతు నిర్వహించాయి. వాయుసేన నిర్వహించిన అద్భుతమైన ఫ్లైపాస్ట్, భద్రతా బలగాల మోటార్ సైకిల్ విన్యాసాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు, మార్షల్ ఆర్ట్స్, అశ్వ, ఒంటె దళాల కవాతు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 4, 700 మంది కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాయి.



తాగునీటి కోసం 120 కోట్లు..

ఎల్‌నినో ఎఫెక్ట్.. మంత్రి సీతక్క కీలక నిర్ణయం

- ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- నాలుగు జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయానికి రూ.120 కోట్లు
- ఇతర జిల్లాలకు ఒక్కోటి రూ.కోటి చొప్పున నిధులు
- బోరుబావులు, ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశం

మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్

2

'ఎలాంటి సాయానికైనా సిద్ధం'..

ఏపీ మంత్రికి తెలంగాణ డిప్యూటీ సీఎం ఫోన్

పనులు ముందుకు కదలడంలేదు

2

పాలమూరు సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే ఉన్నాయన్న డీకే అరుణ

పరిహారం ఇవ్వకుండా ఇళ్లు ఖాళీ చేయించడంపై సీఎంకు ప్రశ్న

పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్

మన ప్రజాపక్షం,హైదరాబాద్



తెలంగాణ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని ఆమె ఆరోపించారు. కొడంగల్‌లోని పున్నంచంద్ లాహోటి



2

తెలంగాణలో క్రాప్ హాలిడేపై

మంత్రి తుమ్మల క్లారిటీ

మన ప్రజాపక్షం,హైదరాబాద్

రాష్ట్రంలో క్రాప్ హాలిడేపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో ప్రభుత్వం ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. క్రాప్

'దిల్లీ మార్చ్'కు రాహుల్ పిలుపు

దేశ రాజధానిలో రాజకీయ వేడి! | **అనుమతి లేదన్న పోలీసులు**

దిల్లీలోని కన్నాట్ ప్లేస్-మింటో రోడ్ జంక్షన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు ఇండి కూటమి తలపెట్టనున్న మార్చ్‌కు అనుమతి లేదని పోలీసులు చెప్పారు.



2

మన ప్రజాపక్షం,ఢిల్లీ

నవంబర్ 1న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి తలపెట్టనున్న భారీ ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు, పౌరులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని అన్నారు. శనివారం తన 'ఎక్స్' ఖాతాలో ర్యాలీకి సంబంధించిన వివరాలను ప్రకటించారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు మింటో రోడ్- కన్నాట్ ప్లేస్ జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే మార్చ్, రామ్‌లీలా మైదానం వరకు సాగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల కమిషన్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న తీరుపైనే ఈ నిరసన చేపడుతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొనేందుకు

కోట్ల మంది హిందువుల ఓట్లు గల్లంతయ్యాయి..

సర్‌పై యూపీ సీఎం సంచలన వ్యాఖ్యలు..

మన ప్రజాపక్షం,ఉత్తరప్రదేశ్



2

లఖ్‌నవూ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సర్ ప్రక్రియ తర్వాత ఓటర్ల జాబితా నుంచి కోట్లాది మంది హిందువుల పేర్లు గల్లంతయ్యాయని ఆయన ఆరోపించారు. సుమారు 1.27 కోట్ల మంది హిందువులను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లందరినీ తిరిగి జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందని సీఎం నొక్కిచెప్పారు.శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో యోగి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ,

బంగ్లాదేశ్‌లో మళ్లీ భారత్ వ్యతిరేక నినాదాలు..

తారిఖ్ రెహ్మాన్ ప్రభుత్వంపై నిరసనలు

- బంగ్లాదేశ్‌లో మళ్లీ భారత్ వ్యతిరేక నినాదాలు
- తారిఖ్ రెహ్మాన్ ప్రభుత్వంపై ఎన్‌సీపీ నిరసన
- విద్యుత్ కోతలు, గ్యాస్ కొరతపై ప్రజాగ్రహం
- బంగ్లాదేశ్ హోం, ఇంధన మంత్రుల రాజీనామాకు డిమాండ్
- గంగా జలాల ఒప్పందంపై నహీద్ ఇస్లాం హెచ్చరిక



2

మన ప్రజాపక్షం,ఢిల్లీ

బంగ్లాదేశ్‌లో మరోసారి భారత్ వ్యతిరేక నినాదాలు మార్మోగాయి. దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ కోతలు, ఇంధనం, గ్యాస్ కొరతపై ప్రధాని తారిఖ్ రెహ్మాన్ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా



2

ఐదు రోజుల వర్ష సూచన..

పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

- అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజుల వర్ష సూచన
- నేటి నుంచి నవంబర్ 4 వరకు వానలు కురిసే అవకాశం
- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

All are Continues Second Page

ఐదు రోజుల వర్ష సూచన..

మొదటి పేజీ తరువాయి

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నేటి నుంచి నవంబర్ 4వ తేదీ వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది.వాతావరణ శాఖ నివేదిక ప్రకారం, అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోంది. దీని ప్రభావంతో ఈరోజు సాయంత్రం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడతాయని అంచనా వేసింది.ముఖ్యంగా నవంబర్ 2, 3 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నవంబర్ 2న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో, నవంబర్ 3న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు సూచించారు.

ప్రైవేటుకు అప్పగిస్తారా?

మొదటి పేజీ తరువాయి

ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు జాతి సంపదని, వాటి విలువను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి అమ్మజూపడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు.“ఐడీబీఐ బ్యాంకు విలువను తక్కువగా అంచనా వేస్తున్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వచ్చినప్పుడు నిబంధనలు, మదింపు పద్ధతులను ఎందుకు మార్చారు? ఐడీబీఐ ఉద్యోగులు లేవనెత్తుతున్న ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు?” అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన నగరాల్లో బ్యాంకుకు అత్యంత విలువైన భూములు, స్థిరాస్తులు ఉన్నాయని, వాటి విలువను సరిగ్గా లెక్కించారా? లేదా? అని నిలదీశారు. “ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేటుపరం చేసే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. ఇంత తొందర ఎందుకు?” అని ఆయన అన్నారు.

పనులు ముందుకు

కదలడంలేదు

మొదటి పేజీ తరువాయి

నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు నెట్టెంపాడు, కల్వకుర్తి, గట్టు లిఫ్ట్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ సమస్యను పరిష్కరించి రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ భూములను విక్రయించడమేంటని ఆమె మండిపడ్డారు.కొడంగల్‌లో రోడ్డు విస్తరణ పనుల కోసం ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ముందుగా నష్టపరిహారం చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. పరిహారం ఇవ్వకుండా వారిని ఎలా ఖాళీ చేయిస్తారని ముఖ్యమంత్రిని ఆమె నేరుగా ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరైన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై తక్షణమే దృష్టి సారించాలని సూచించారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారు..

మొదటి పేజీ తరువాయి

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో నవంబర్ 2వ తేదీన పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు అమిత్ షా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి ఆయన చేరుకోనున్నారు. బేగంపేట నుంచి కాకతీయ హోటల్‌కు వెళ్లనున్నారు. 4గంటల వరకు కాకతీయ హోటల్‌లో కేంద్ర హోం మంత్రి బసచేయనున్నారు. 4గంటలకు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు నిర్వహించనున్న ర్యాలీలో అమిత్ షా పాల్గొననున్నారు.5 గంటల నుంచి 5:30 వరకు ఎంజే మార్కెట్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్‌కు అమిత్ షా హాజరుకానున్నారు. అనతరం 6గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు ఉన్న రిజర్వ్ షెడ్యూల్‌లో రాష్ట్రంలోని ప్రముఖులను కేంద్ర హోం మంత్రి కలిసే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ ముఖ్య నేతలతో కూడా అమిత్ షా భేటీ అయ్యే ఛాన్స్ ఉంది.

తాగునీటి కోసం 120 కోట్లు..

మొదటి పేజీ తరువాయి



జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు.రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు.చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సీతక్క సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి నీరు చేరేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణలో

క్రాప్ హాలిడేపై

మంత్రి తుమ్మల క్లారిటీ

మొదటి పేజీ తరువాయి

హాలిడేపై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న ప్రచారం అవాస్తవమని.. రైతులు ఈ విషయాన్ని నమ్మొద్దని అన్నారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్త విపత్తు అని.. ఈ విషయంలో ముందస్తు జాగ్రత్తలను తాము తీసుకుంటున్నామని తెలిపారు. ఆరు నెలలుగా రైతన్నలకు ఎల్‌నినోపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి, సమీకృత పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు.

రైతన్నలు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలి..

ప్రతి వారం వాతావరణం, వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను అన్నదాతలకు చేరవేస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. రైతులకు సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో 365 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించి, రైతన్నలకు అండగా తమ ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నదాతలకు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తోందని తెలిపారు. రైతన్నలను నష్టాల నుంచి కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం వస్తోందని.. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కల్పిస్తోందని వెల్లడించారు. నవంబర్ నుంచి మార్చి వరకు మొత్తం 35.21 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రైతన్నలు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

‘ఎలాంటి సాయానికైనా సిద్ధం’..

మొదటి పేజీ తరువాయి

మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేశారు. ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఉపముఖ్యమంత్రికి మంత్రి గొట్టిపాటి రవి వివరించారు. సిబ్బంది, సామాగ్రిని కొరత ఉంటే తెలియజేయాలని భట్టి కోరారు. తెలంగాణ నుంచి ఎలాంటి సాయమైనా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో 1,100 మందికి పైగా తెలంగాణ విద్యుత్ సిబ్బంది పని చేస్తున్నారని ఏపీ మంత్రి తెలిపారు. ఏపీ డిస్కంలకు చెందిన 4,400 మంది సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో ఉన్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.



బంగ్లాదేశ్‌లో మళ్లీ భారత్ వ్యతిరేక నినాదాలు..

మొదటి పేజీ తరువాయి

నిరసనలు వెల్లువెత్తాయి. హోం, ఇంధన శాఖల మంత్రులు రాజీనామా చేయాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనల్లో భాగంగా నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) నిర్వహించిన భారీ ర్యాలీలో భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఢాకాలోని నేషనల్ మ్యూజియం ఎదుట శుక్రవారం ఈ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీపీ కన్వీనర్ నహీద్ ఇస్లాం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారు. ‘ఢిల్లీ కాదు.. ఢాకా’ అంటూ నేతలు నినాదాలు చేయగా, సభకు హాజరైనవారు ‘ఢాకా.. ఢాకా’ అంటూ స్పందించినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమైన వీడియోలు చూపించాయి. 2024లో షేక్ హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించిన విద్యార్థుల ఉద్యమం నుంచి ఎన్‌సీపీ ఆవిర్భవించింది. ర్యాలీలో నహీద్ ఇస్లాం భారత్‌పై ఆరోపణలు చేశారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా భారత్ కుట్రలు చేస్తోందని, సరిహద్దుల్లో హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. అసోం, పశ్చిమ బెంగాల్‌లో ముస్లింలపై వేధింపులు జరుగుతున్నాయని, ఢిల్లీలో మసీదులను కూల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలకు ఆధారాలను ఆయన చూపలేదని కథనం వెల్లడించింది. గంగా జలాల ఒప్పందాన్ని న్యాయంగా పునరుద్ధరించకపోతే మరోసారి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. భారత్-బంగ్లాదేశ్ మధ్య కుదిరిన 30 ఏళ్ల గంగా జలాల ఒప్పందం ఈ ఏడాది డిసెంబరుతో ముగియనుంది. బంగ్లాదేశ్‌లో గత కొన్ని నెలలుగా ఇంధన సంక్షోభం తీవ్రతరమైంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిణామాల కారణంగా ఇంధన సరఫరాకు అంతరాయాలు ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్ తన చమురు అవసరాల్లో 90 శాతానికి పైగా, గ్యాస్ అవసరాల్లో 30 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. విద్యుత్ కోతలతో వస్త్ర పరిశ్రమల్లో ఉత్పత్తి కూడా దెబ్బతింటోంది. 2026లో ద్రవ్యోల్బణం సుమారు 8.5 శాతంగా ఉండటంతో ప్రజలపై ధరల భారం పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే మరో 21 లక్షల మంది పేదరికంలోకి వెళ్లినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది.ఈ పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని నహీద్ ఇస్లాం డిమాండ్ చేశారు. హోం మంత్రి సలాహుద్దీన్ అహ్మద్, ఇంధన మంత్రి ఇక్బాల్ హసన్ మహమూద్ రాజీనామా చేయాలని కోరారు. వారు పదవుల నుంచి తప్పుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి, ప్రధాని తారిఖ్ రెహ్మాన్ నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దేశీయ సమస్యలపై మొదలైన ఈ నిరసనల్లో భారత్ వ్యతిరేక నినాదాలు కూడా వినిపించడం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఒడుదొడుకులకు లోనైన సంబంధాలపై మరోసారి చర్చకు దారితీసింది.

‘దిల్లీ మార్చ్’కు రాహుల్ పిలుపు

మొదటి పేజీ తరువాయి

ప్రజలు దిల్లీకి రాకుండా అడ్డుకునేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.మరోవైపు, రాహుల్?గాంధీ పోస్టుపై స్పందించిన దిల్లీ పోలీసులు, కన్నాట్ ప్లేస్ నుంచి మార్చ్ ప్రారంభించడానికి ఎటువంటి దరఖాస్తు అందలేదని పేర్కొన్నారు. అదే సమయంలో ఎంపీలు, రాజకీయ నాయకులు తమ ప్రైవేట్ వాహనాల్లో కాన్స్టిట్యూషన్ క్లబ్‌కు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లడానికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. అలాగే, గతంలో నిరసనలకు వేదికైన జంతర్ మంతర్ ఎలాంటి కార్యక్రమాలు తలపెట్టరాదని ఇదివరకే ప్రకటించారు.

దిల్లీలో ట్రాఫిక్ ఆంక్షలు

ఇండి కూటమి ర్యాలీ నేపథ్యంలో దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా రాంలీలా మైదానంలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సెంట్రల్ డిస్ట్రిక్ట్ సహా పలు దిల్లీ పోలీస్ విభాగాలకు చెందిన సిబ్బంది, అదనంగా పారామిలిటరీ బలగాలను రంగంలోకి దించుతున్నారు. అలాగే దిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సెంట్రల్ దిల్లీలోని కీలకమార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. ట్రాఫిక్ పరిస్థితిని బట్టి, సెంట్రల్ దిల్లీలోని నేతాజీ సుభాష్ మార్గ్ టి-పాయింట్, రాజ్‌ఘాట్, దిల్లీ గేట్, ఐటీఓ ఎ-పాయింట్, అజ్మేరీ గేట్ రెడ్ లైట్, రంజీత్ సింగ్ ఫ్లైఓవర్, ఝండేవలన్ రౌండ్‌అబౌట్, తుర్క్‌మన్ గేట్, మిర్దార్డ్ చౌక్‌తో సహా కీలక కూడళ్లలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని తెలిపారు. రైలు ప్రయాణికులు ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచించారు.ఇండి కూటమి తలపెట్టనున్న ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొనడానికి ప్రజలు దిల్లీకి తరలివస్తున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. “ఏది ఏమైనా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ర్యాలీ చేపడతాం. దేశం నలుమూలల నుంచి జనం అధిక సంఖ్యలో దిల్లీకి బయలుదేరారు. దిల్లీ ఇప్పటివరకు చూసిన అతిపెద్ద ర్యాలీల్లో ఇది ఒకటిగా నిలుస్తుంది” అని మీడియాతో చెప్పారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి సంబంధించి అమిత్ షా చేసిన ప్రకటనపై కూడా వేణుగోపాల్ స్పందించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం నోటీసును తిరస్కరించడంపై వేణుగోపాల్ మండిపడ్డారు. 100 మందికి పైగా పార్లమెంట్ సభ్యులు సంతకాలు చేసినందుకు ఆ నోటీసును పరిశీలనకు స్వీకరించి ఉండాల్సిందన్నారు. ఆ తీర్మానాన్ని ఎందుకు ముందుకు సాగనివ్వలేదని ప్రశ్నించారు.ఇదిలా ఉండగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అభిశంసన కార్యక్రమాన్ని, శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు మల్లికార్జున ఖర్గే నివాసంలో నిర్వహించేందుకు ఇండియా కూటమి నాయకులు సన్నద్ధమయ్యారు. వాస్తవానికి శుక్రవారమే నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం వర్షం కారణంగా వాయిదా పడింది. సీనియర్ నాయకులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

కోట్ల మంది హిందువుల ఓట్లు గల్లంతయ్యాయి..

మొదటి పేజీ తరువాయి

హిందువుల ఓట్ల తొలగింపుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి యోగి మాట్లాడుతూ.. సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులను హెచ్చరించారు.ప్రస్తుతం యూపీలో సుమారు 13 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, అయితే వాస్తవానికి ఆ సంఖ్య 16 కోట్లకు పైగా ఉండాలని సీఎం యోగి చెప్పారు. పంచాయతీ ఓటర్ల జాబితాలో పేర్లున్న 66 లక్షల మంది అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాలో లేరని ఆరోపించారు. దీంతో 28 పట్టణ స్థానిక సంస్థల నియోజకవర్గాల్లో బీజేపీ బలహీన పడే పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న 55 లక్షల మంది పేర్లు కూడా ఓటర్ల జాబితాలో లేవని విమర్శించారు. అలాగే, 18-19 ఏళ్ల వయసున్న సుమారు 4.5 లక్షల మంది యువత ఓటర్ల జాబితాలో చోటు దక్కించుకోలేదని వెల్లడించారు. గత సర్ ప్రక్రియలో కేవలం నాలుగు లక్షల మందినే కొత్త ఓటర్లుగా చేర్చడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ఓటర్లందరి పేర్లు జాబితాలో ఉండేలా చూడాలని, ఇందుకోసం బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని పార్టీ కార్యకర్తలకు సీఎం సూచించారు.ఈ అంశంపై క్రమం తప్పకుండా సమీక్షలూ నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా హిందువుల ఓట్లు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యతను ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యవర్గ సభ్యులకు అప్పగించారు. కాగా, సర్ ప్రక్రియ తర్వాత ఉత్తరప్రదేశ్ ఓటర్ల జాబితా నుంచి వివిధ కారణాలతో 2.04 కోట్ల మంది పేర్లను ఎన్నికల అధికారులు తొలగించారు. ఈ తొలగింపులు ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా జరిగాయి. ముఖ్యంగా మహిళా ఓటర్లు తీవ్రంగా ప్రభావితమయ్యారు. అయితే, భారత ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం 84 లక్షలకు పైగా కొత్త ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చారు. దీంతో యూపీలో తుది ఓటర్ల సంఖ్య 13,39,84,792కు చేరింది. అయితే, ఓటర్ల జాబితా నుంచి హిందువుల పేర్లు తొలగించారంటూ యోగి ఆదిత్యనాథ్ ఆరోపించడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ హిందువుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని పలుమార్లు బీజేపీ కార్యకర్తలకు ఆయన సూచించారు.

నేటి నుండి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ తరగతులు ప్రారంభం



మహబూబ్ నగర్, మన ప్రజాపక్షం: డా.బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం రీజనల్ సెంటర్ లో నవంబర్ 1 ఆదివారం నుండి డిగ్రీ ప్రథమ, ద్వితీయ,తృతీయ సంవత్సరాల 1,3,5 సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతున్నాయని ఎంవిఎస్ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.పద్మావతి మరియు రీజనల్ కో ఆర్డినేటర్ డా.జి.సత్యనారాయణ గౌడ్ తెలిపారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లించిన రశీదు, యూనివర్సిటీ పంపిన పుస్తకాలు తీసుకురావాలని, తరగతులు ఉదయం 9:00 గం నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతాయని అన్నారు.సమాచారం కొరకు “7382929609” నెంబర్ కు కాల్ చేయాలని వారు తెలిపారు.




ఘనంగా బీజేవైఎం జనగామ జిల్లా కార్యవర్గ సమావేశం

యువత తలుచుకుంటే ప్రభుత్వాలనే మార్చగలదు

బిజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎల్లబోయిన హరీష్ యాదవ్

జనగామ, మన ప్రజాపక్షం:
భారతీయ జనతా పార్టీ జనగామ జిల్లా కార్యాలయంలో బీజేవైఎం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎల్లబోయిన హరీష్ యాదవ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పార్టీ అభివృద్ధిలో యువమోర్చా కీలక పాత్ర పోషిస్తోందని, దేశ, రాష్ట్ర స్థాయిలో పలువురు ప్రముఖ నాయకులు గతంలో యువమోర్చాలో పనిచేసిన వారేనని గుర్తు చేశారు. యువత తలుచుకుంటే ప్రభుత్వాలను సైతం మార్చగల శక్తి ఉందని అన్నారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన యువమోర్చా నాయకులు పదవులను హోదాలుగా కాకుండా బాధ్యతలుగా భావించి, పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో బీజేపీ సూచనల మేరకు యువమోర్చా నాయకులు ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఇన్‌చార్జి శివచంద్ర గిరి, రాష్ట్ర అధికార ప్రతినిధి చింతకింది సంతోష్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు గణేష్, శ్యామ్, జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



పటేల్ ఆశయాలే నక్సలిజం అంతానికి స్ఫూర్తి.. దేశ ఐక్యతే లక్ష్యం

ఏక్తా దివస్‌లో ప్రధాని మోడీ

కీలక వ్యాఖ్యలు.. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు

అక్టోబర్ 31, సెంట్రల్ బ్యూరో:
సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు, స్ఫూర్తితోనే దేశం ఐక్యత దిశగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు భారత్ ఐక్యంగా ఉండాలని పటేల్ ఆకాంక్షించారని గుర్తుచేశారు. దేశంలో నక్సలిజం అంతం కావడం పటేల్ సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఒకప్పుడు వందలాది జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం ఉండేదని, ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఆ ప్రభావం పూర్తిగా తగ్గిపోయిందని తెలిపారు.గతంతో పోలిస్తే ప్రస్తుతం భారత్ మరింత సురక్షితంగా మారిందని, యువతలో ఆత్మవిశ్వాసం పెరిగిందని మోడీ అన్నారు. పేదరిక నిర్మూలన పేరుతో కాంగ్రెస్ నేతలు గతంలో ఓట్లు అడిగారని, కానీ పేదరికాన్ని తగ్గించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఆ పాలకులు సంపన్నులయ్యారే తప్ప పేదల జీవితాల్లో ఆశించిన మార్పు తీసుకురాలేకపోయారని ఆరోపించారు.తమ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశ రూపురేఖలు మారుతున్నాయని, ఢిల్లీ నుంచి విడుదలయ్యే ప్రతి రూపాయి నేరుగా పేదలకు చేరుతోందని తెలిపారు. కోట్లాది మందికి మౌలిక సదుపాయాలు అందుతున్నాయని వివరించారు.

అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారం

విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై ఉప్పునుంతల తహసీల్దార్ సస్పెన్షన్

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఉత్తర్వులు జారీ



నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డివిజన్ ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 115లో భూ రికార్డుల నమోదుకు సంబంధించి జరిగినట్లు గుర్తించిన అవకతవకలు, సంబంధిత పత్రాల పరిశీలనలో విధుల నిర్వహణలో వైఫల్యంపై విచారణ నివేదిక ఆధారంగా తహసీల్దార్ ఎ.సునీతను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ హేమంత కేశవ్ పాటిల్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అయ్యవారిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 115లో 13.17 గుంటల భూమి అక్రమంగా ఇతరుల పేర్లపై నమోదైనట్లు పలు వార్తా దినపత్రికలో ప్రచురితమైన వార్త నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంపై అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాను విచారణ అధికారిగా నియమించగా, ఆమె సమగ్ర విచారణ నిర్వహించి జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పించారు.విచారణలో భాగంగా పాత రెవెన్యూ రికార్డులు, పహాణీలు, ఖాస్రా, ఆర్ఓఆర్ రికార్డులు, భూ భారతి పోర్టల్‌లోని దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన ఎన్‌కంబరెన్స్ వివరాలు తదితర పత్రాలను పరిశీలించారు.విచారణ నివేదిక ప్రకారం సర్వే నంబర్ 115లో మొత్తం 18.17 గుంటల భూమి ఉన్నట్లు ఖాస్రా రికార్డుల్లో నమోదై ఉంది. 1971-72 నుంచి 1976-77 వరకు ఉన్న పాత పహాణీలు, ఐబీ రిజిస్టర్ ప్రకారం మొత్తం భూమి ద్యాప రామిరెడ్డి పేరుపై నమోదై ఉన్నట్లు గుర్తించారు.నూతన ఆర్ఓఆర్ రికార్డుల ప్రకారం 13 ఎకరాల 17 గుంటలు సర్వే నంబర్ 115/ఏ లో ద్యాప రామిరెడ్డి పేరుపై, మిగిలిన 5 ఎకరాలు సర్వే నంబర్ 115/ఏఏ లో పి.యాదమ్మ పేరుపై నమోదై ఉన్నట్లు విచారణలో వెల్లడైంది.భూ భారతి పోర్టల్ ద్వారా దాఖలైన పేర్ల మార్పు, సర్వే నంబర్ ఉపవిభాగాల నమోదుకు సంబంధించిన దరఖాస్తులు, వాటికి జతచేసిన పత్రాలు, డిజిటల్ సంతకాల ప్రక్రియను కూడా విచారణలో పరిశీలించారు. కొన్ని నమోదులు అసలు రెవెన్యూ రికార్డులతో సరిపోలడం లేదని, సంబంధిత పత్రాల ధృవీకరణలో లోపాలు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో అప్పట్లో చారకొండ తహసీల్దార్‌గా పనిచేసి ప్రస్తుతం డిప్యుటేషన్‌పై ఉప్పునుంతల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.సునీత తనకు అప్పగించిన చట్టబద్ధమైన విధులను సక్రమంగా నిర్వర్తించడంలో విఫలమైనట్లు విచారణ నివేదికలో పేర్కొనడంతో ఆమెపై సస్పెన్షన్ చర్యలు చేపట్టారు.తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 8(1)(ఏ) ప్రకారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.క్రమశిక్షణా విచారణ పూర్తయ్యే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుంది.

భూసేకరణ భూముల వివరాలు భూ భారతి రికార్డుల్లో నమోదు చేయాలి

నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, ప్రధాన కాలువల నిర్మాణం కోసం భూసేకరణ చట్టం ద్వారా రైతులు, ప్రజల నుంచి సేకరించిన భూముల వివరాలను భూ భారతి పోర్టల్‌తో పాటు రెవెన్యూ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భూసేకరణ ద్వారా నీటిపారుదల శాఖకు బదిలీ అయిన భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, భూసేకరణ ప్రత్యేక అధికారి అరుణ రెడ్డితో కలిసి నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన సాగునీటి ప్రాజెక్టులు, వాటి ప్రధాన కాలువల నిర్మాణాలకు అవసరమైన భూములను భూసేకరణ చట్టం ప్రకారం రైతులు, ప్రజల నుంచి సేకరించిన అనంతరం ఆయా భూముల వివరాలను తప్పనిసరిగా భూ భారతి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం సంబంధిత మండలాల తహసీల్దార్లతో సమన్వయం చేసుకుంటూ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని 75 గ్రామాల పరిధిలో భూముల రీ-సర్వే ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటివరకు 15 గ్రామాల్లో సర్వే పనులు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో రైతుల నుంచి సేకరించి నీటిపారుదల శాఖకు బదిలీ చేసిన భూములను రీ-సర్వేలో నీటిపారుదల శాఖకు సంబంధించిన ప్రభుత్వ భూములుగా గుర్తించి, భూ భారతి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.ఈ ప్రక్రియను నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక చొరవతో వేగవంతంగా పూర్తి చేయాలని, జిల్లాలో ఇంకా కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు అమర్ సింగ్, లింగాల్, కలెక్టరేట్ విభాగపు సూపరింటెండెంట్ నారాయణ,ఏఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 30న తుది ఓటరు జాబితా విడుదల

ఎస్ఐఆర్ గడువు పొడిగింపు...

నవంబర్ 26 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ

చునావ్ పాఠశాల ద్వారా ఓటు హక్కుపై విద్యార్థి స్థాయి నుండే విస్తృత అవగాహన


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షలో వెల్లడించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వెల్లడించారు. ఎన్నికల సంఘం ప్రకటించిన నూతన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 26వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. సవరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం నవంబర్ 30వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఈ ప్రక్రియ చేపట్టిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓటరు నమోదు, వివరాల మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ దరఖాస్తులను బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన ధ్రువీకరణ చేపడుతున్నారని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల భాగస్వామ్యం ఎంతో కీలకమని కలెక్టర్ అన్నారు. తమ పరిధిలోని ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా లోపాలు గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హుల పేర్లు నమోదుకాకుండా నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపైనా కలెక్టర్ వివరించారు. అర్హత కలిగిన పట్టభద్రులు నవంబర్ 6వ తేదీలోగా నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకుని ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ గడువుపై పట్టభద్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీలకు సూచించారు.జిల్లాలోని నాగర్ కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటివరకు 29,890 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదైనట్లు కలెక్టర్ వెల్లడించారు. 1,335 మంది దరఖాస్తులు పరిశీలనలో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న వాటికి ఆమోదం తెలుపనున్నట్లు తెలిపారు.ఓటరు జాబితా సవరణ, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు, ఓటరు నమోదు విధానంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.ఓటు ప్రాముఖ్యతపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించేందుకు నాగర్ కర్నూల్ జిల్లాలో చునావ్ పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కార్యక్రమంలో రాజకీయ పార్టీలు కూడా పాల్గొనాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా హాబిబ్, బిజెపి పార్టీ ప్రతినిధిగా నాగేందర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధిగా విష్ణు సాగర్, వైయస్సార్సీపి పార్టీ ప్రతినిధిగా ఎండి హుస్సేన్, టిడిపి పార్టీ ప్రతినిధిగా బాలకృష్ణ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగికి గుర్తింపు ఉద్యోగములో చేసిన సేవలే

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత మంతటి నారాయణ



అచ్చంపేట,మన ప్రజాపక్షం:ఆర్టీసీలో కండక్టర్ గా సుదీర్ఘంగా పనిచేసి శనివారం నాడు పదవి విరమణ పొందుతున్న తగురం రామస్వామి దంపతులను పూలమాలతో, శాలువతో ఘనంగా సన్మానించామని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, అచ్చంపేట డివిజన్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు మంతటి నారాయణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామస్వామి సుదీర్ఘంగా ఆర్టీసీలో కండక్టర్ గా పనిచేసి అందరి మన్ననలను పొందారన్నారు. కండక్టర్ ఉద్యోగం అంటే కత్తి మీద సాము లాంటిద న్నారు. అటువంటి ఉద్యోగములో ఎటువంటి మెమోలు గాని, సస్పెండ్ గాని,జీతం కటింగులు గాని లేకుండా ఆణిముత్యములా ఈ రోజు అందరి మన్ననల, అభినందనల, శుభాకాంక్షల మధ్యన పదవి విరమణ పొందారన్నారు. రామస్వామి పిల్లలను మంచి ఉన్నతమైన చదువులు చదివించారన్నారు. తన ఉద్యోగ ప్రయాణంలో ఎప్పుడు కూడా ఎలాంటి మచ్చ లేకుండా ఉద్యోగం చేసి అధికారుల నుండి మన్ననలను, అభినందనలు, అవార్డులు పొందారన్నారు. ఏ రోజు కూడా డ్యూటీకి హాజరుకాకుండా ఉండలేదన్నారు. అటువంటి వ్యక్తి ఈరోజు పదవి విరమణ పొందుతున్నాడు అంటే చాలా బాధగా ఉందన్నారు. ఆర్టీసీ సంస్థకు ఉద్యోగులే కీలక పాత్ర వహించడం జరుగుతుందన్నారు. వారి కృషి వల్లనే నేడు ఆర్టీసీ ఆదాయానికి కారణం అవుతున్నారు. రామస్వామి ఆర్టీసీ సంస్థను తల్లిలాగ భావించి, వృత్తిని దైవములా కొలిచే వ్యక్తులలో రామస్వామి ఒకరన్నారు. ప్రతి ఉద్యోగి పదవి విరమణతో తమ జీవితం అయిపోయిందని అనుకోకుండా సంస్థకు సేవలు అందించాలన్నారు. సుదీర్ఘ సర్వీసు కాలంలో ఎలాంటి రిమార్కులు లేకుండా క్రమశిక్షణ, నిబద్ధతతో తన విధులను నిర్వహించారన్నారు. విజిల్ శబ్దంతో మొదలైన మీ ఉద్యోగ ప్రయాణం ఇన్నేళ్ల తర్వాత ఎన్నో మధుర జ్ఞాపకాలతో ముగుస్తుందన్నారు. బస్సులో ప్రతి సీటు మీకు తెలుసు, ప్రతి ప్రయానికుడు మీకు పరిచయం అన్నారు. ఆర్టీసీ మిమ్మల్ని రిటైర్మెంట్ చేస్తుందేమో కానీ మా మనసులో మీరు ఎప్పటికీ మా కండక్టర్ గానే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో చందు, నారాయణ, వెంకటయ్య, ఎం.పర్వతాలు, సత్యనారాయణ, నాగయ్య గౌడ్, జి.పర్వతాలు, మధుప్రియ, రుషి కుమార్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’కి పయనమైన నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ శ్రేణులు

ఎమ్మెల్యే డా. ఆర్.భూపతి రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీకి తరలివెళ్లిన ఏడు మండలాల కాంగ్రెస్ నాయకులు

100 మందికి పైగా నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం

రాహుల్ గాంధీ పిలుపు మేరకు రామ్‌లీలా మైదానంలో ‘ఓట్ బచావో.. దేశ్ బచావో’ ర్యాలీ



నిజామాబాద్,మన ప్రజాపక్షం:
ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల రక్షణ, ప్రజల ఓటుహక్కును కాపాడాలనే లక్ష్యంతో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ‘చలో ఢిల్లీ’ కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లాయి. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిపి 100 మందికి పైగా ఢిల్లీకి బయలుదేరారు. కొందరు రైలు మార్గంలో,హైదరాబాద్, నాగ్‌పూర్ విమానాశ్రయం నుంచి విమానాల ద్వారా, మరికొందరు బస్సులు ఇతరత్రా రవాణా, మార్గాల ద్వార ఢిల్లీకి పయనమయ్యారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో దేశ ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటుహక్కుకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, దానిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల ఓటుహక్కును పరిరక్షించడంతో పాటు ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలనే లక్ష్యంతో రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ‘ఓట్ బచావో.. దేశ్ బచావో’ నినాదంతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ వివాదానికి సంబంధించి ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.ఢిల్లీకి బయలుదేరిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్లు సాయారెడ్డి, తారాచంద్ నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, పొలసాని శ్రీనివాస్, రామచందర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చింతల కిషన్, గోవర్ధన్ రెడ్డి, రవి, గాదె నరేష్, జనార్ధన్, మాజీ ఎంపీపీ రాజన్న, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు మహేందర్, కార్పొరేటర్ భోజన్న తదితరులు ఉన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడతాం

పనులను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్,మన ప్రజాపక్షం:
రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు, భద్రతాపరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.శనివారం సాయంత్రం హైదరాబాద్ నుండి రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పలు జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని సూచించారు. నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం, పాత ఘాట్ల మరమ్మతులు, ఇతర మౌలిక



సదుపాయాల కల్పన పనులను నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. భక్తులకు సురక్షిత తాగునీరు అందించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నిర్మాణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పుష్కర ప్రాంతాల్లో ఆకర్షణీయమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు సంబంధించి జిల్లాలో చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిపై నిరంతరం సమీక్షిస్తున్నామని చెప్పారు. అన్ని పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. భక్తులకు సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలంకరణతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల ఈఈలు అనిల్, సందీప్, తుకారాం, సీపీఓ గంగారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రమణ, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

గడువులోగా భూముల రీ సర్వే పూర్తి చేసేలా ప్రణాళికలు అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా


నిర్మల్,మన ప్రజాపక్షం:
ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు, భూముల రీ సర్వే, ఇతర రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తి



స్థాయిలో అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జరిమానాలు విధించి, వాహనాలు జప్తు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకూడదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు కేవలం టిజిఎండిసి లేదా మన ఇసుక వాహనం యాప్ ద్వారా మాత్రమే ఇసుక పొందాలని తెలిపారు.భూముల రీ సర్వే వివరాలను మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో 19 మండలాలకు 21 సర్వే పరికరాలు (రోవర్లు) ఉన్నాయని, స్పష్టమైన ప్రణాళికలతో గడువులోగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాకు మరిన్ని సర్వే యంత్రాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రతి సర్వే సిబ్బందికి టోపీ, తాగునీరు, ఓఆర్ఎస్ పొట్లాలతో కూడిన కిట్ లను అందించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను ప్యాసింజర్ రైలుగా మార్చాలి

కేంద్ర రైల్వే మంత్రికి ‘నాగరత్న సేవా సంఘం’ విజ్ఞప్తి



జనగామ, మన ప్రజాపక్షం:జనగామ జిల్లా ప్రజలు, నిత్య ప్రయాణికులు మరియు రోజువారీ కూలీ కార్మికుల ప్రయాణ సౌకర్యార్థం కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను తిరిగి ప్యాసింజర్ రైలుగా మార్చి, అన్ని స్టేషన్లలో నిలుపుదల కల్పించాలని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారీ, బిర్రు కిషన్ సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని విజ్ఞప్తి చేశారు.?కరోనా మహమ్మారికి ముందు సికింద్రాబాద్ నుండి కాజీపేట వరకు నడిచిన కాకతీయ ప్యాసింజర్ రైలును ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ రైలుగా మార్చడంతో భువనగిరి, ఆలేరు, జనగామ, కాజీపేట వంటి కొన్ని ప్రధాన స్టేషన్లలో మాత్రమే ఆగుతోందని వారు పేర్కొన్నారు. మార్గమధ్యంలోని చిన్న స్టేషన్లలో రైలు నిలుపుదల లేకపోవడం వల్ల రోజువారీ కూలీ పనులు చేసుకునే కార్మికులు, చిరు వ్యాపారులు, విద్యార్థులు మరియు సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ?అదేవిధంగా గతంలో జనగామ నుండి ఫలక్‌నుమా వరకు నడిచే డెమో ప్యాసింజర్ రైలు ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో వేలాది మంది నిత్య ప్రయాణికులు రవాణా సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. ముఖ్యంగా మౌలాలి, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, రాయగిరి, వంగపల్లి, ఆలేరు, పెంబర్తి, జనగామ, రఘునాథపల్లి తదితర ప్రాంతాల నుండి ప్రతిరోజూ హైదరాబాద్‌కు ఉపాధి మరియు కూలీ పనుల కోసం వెళ్లే వేలాది



మందికి ఈ రైలు ప్రయాణమే ప్రధాన ఆధారమని గుర్తుచేశారు. ?ఈ సందర్భంగా నాగరత్న సేవా సంఘం ప్రతినిధులు కేంద్ర రైల్వే మంత్రికి పలు కీలక డిమాండ్లను విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌గా నడుస్తున్న కాకతీయ రైలును ప్యాసింజర్ రైలుగా మార్చి మార్గమధ్యంలోని అన్ని స్టేషన్లలో ఆపాలని, గతంలో నడిచిన జనగామ–ఫలక్‌నుమా డెమో ప్యాసింజర్ రైలును తక్షణమే పునరుద్ధరించాలని, అలాగే జనగామ నుండి సికింద్రాబాద్ లేదా కాచిగూడ వరకు ప్రతిరోజూ కొత్త డెమో/ప్యాసింజర్ రైలు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ రైళ్లను పునరుద్ధరించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలు, రోజువారీ కూలీలు, విద్యార్థులు మరియు ఉద్యోగులకు తక్కువ ఖర్చుతో సురక్షితమైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.జనగామ జిల్లా ప్రజలు మరియు ప్రయాణికుల ఇబ్బందులను మానవతా దృక్పథంతో పరిశీలించి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని నాగరత్న సేవా సంఘం ప్రతినిధులు బిర్రు ఇస్తారీ, బిర్రు కిషన్ మరియు స్థానిక ప్రజలు కోరారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా స్ఫూర్తితో ముందుకు సాగాలి

కలెక్టరేట్ లో ఘనంగా ఐక్యతా దినోత్సవ వేడుకలు

నిర్మల్,మన ప్రజాపక్షం:
సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. భారత తొలి ఉప ప్రధాని, మాజీ హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అధికారులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి పటేల్ అని కొనియాడారు. అధికారులు, సిబ్బంది అంతా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని తెలిపారు.ఈ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జనగామ మున్సిపాలిటీలో ఘనంగా గణిపాక బిక్షపతి పదవీ విరమణ వీడ్కోలు సన్మానం!

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ మున్సిపాలిటీలో బిడబ్ల్యూఏ గా విధులు నిర్వహిస్తూ, 36 సంవత్సరాల సుదీర్ఘ సేవలను విజయవంతంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందిన గణిపాక బిక్షపతికి జనగామ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు మరియు సన్మాన కార్యక్రమం నిర్వహించడమైనది.?ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధికారులు మరియు సిబ్బంది మాట్లాడుతూ జి. బిక్షపతి గత 36 సంవత్సరాలుగా జనగామ మున్సిపాలిటీలో ఎంతో అంకితభావంతో, క్రమశిక్షణతో మరియు నిబద్ధతతో విధులు నిర్వహించారని కొనియాడారు. మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలలో, ప్రజలకు అందించే పౌర సేవల్లో తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ అందరి మన్ననలు పొందారని ప్రశంసించారు. మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు నిబద్ధతతో సేవలందించడం ఎంతో అభినందనీయమని, వారి సేవలు జనగామ మున్సిపాలిటీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.?అనంతరం, మున్సిపాలిటీ తరపున జి. బిక్షపతి ని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు.మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు మరియు సిబ్బంది ఆయనకు హృదయపూర్వక అభినందనలు, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

నవాబుపేటలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నవాబుపేట గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని నాయకులు సూచించారు. పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు బొల్లంపల్లి నాగేందర్, భీమా రాజు, మాజీ ఎంపీటీసీ తీగల సిద్ధు గౌడ్, నవాబ్ పేట గ్రామశాఖ అధ్యక్షుడు పిల్లి అనిల్, మండల కార్యదర్శి సిహెచ్ సమ్మయ్య, బి.రమేష్, ఎం.సత్యనారాయణ, బి.కృష్ణ, యు.శ్రీను, ఎండీ జలీల్, ఏ.సంపత్, డి.బాలకృష్ణ, ఎల్.కనకరాజు, టి.వెంకటేష్, చి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నాడు నాగర్ కర్నూల్ పట్టణంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల నందు సురక్షిత్ బచ్పన్ అభియాన్ -ఏ పాన్ ఇండియా స్కూల్ అవేర్నెస్ క్యాంపెయిన్ గురించి విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నసీం సుల్తానా స్పెషల్ సెషన్స్ జడ్జ్ ఫర్ పోక్సో కోర్టు నాగర్ కర్నూల్ హాజరై మాట్లాడుతూ సురక్షిత్ బచ్పన్ అభియాన్ అనేది భారతదేశంలో పిల్లల రక్షణ, హక్కులు మరియు వారి భద్రతను పెంపొందించడం కోసం ఉద్దేశించిన ఒక ముఖ్యమైన కార్యక్రమం అన్నారు.చిన్న పిల్లలపై జరిగే లైంగిక దాడులు, వేధింపులను అడ్డుకోవడం కోసం ఏర్పాటైన పోక్సో చట్టంపై పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉదేశ్యం అన్నారు. పోక్సో చట్టం అనేది ప్రస్తుతం మన దేశంలో అమలులో ఉన్న అత్యంత పవర్ఫుల్ చట్టం అన్నారు. ఒకవేళ ఎవరి పైన అయిన పోక్సో కేసు నమోదు అయితే వారు జైలు జీవితం గడపవలసి వస్తుంది అన్నారు.అప్పుడు కుటుంబ సభ్యులు అందరూ మానసికంగా కుంగిపోతారు అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి వివరించడం జరిగింది. బాలలు అందరూ సురక్షితమైన బాల్యాన్ని పొందాలి అన్నారు.ఈ సందర్భంగా బాలల రక్షణకు సంబంధించిన పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో నిహారిక సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ,శ్రీరామ్ ఆర్య గవర్నమెంట్ లాయర్,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



19వ రోజుకు చేరిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

కలెక్టరేట్ ఎదుట సంకెళ్లు ధరించి వినూత్న నిరసన

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
ఎన్హెచ్ ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కొనసాగిస్తున్న దీక్ష 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎన్హెచ్ఎం ఉద్యోగులు రోజుకో పద్ధతిలో తమదైన శైలిలో నిరసన చేస్తున్నారు. 19వ రోజున సంకెళ్లు ధరించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ 78 కేడర్ల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాల నుంచి విముక్తి కల్పించాలని అన్నారు.కోవిడ్ సమయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగుల సేవలు మరువలేనివి అన్నారు.ఏళ్ల తరబడి సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.మా కుటుంబాలకు భరోసా.. పిల్లల భవిష్యత్తుకు భద్రత కల్పించాలని కోరారు.ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి స్పందించాలని, ఎన్హెచ్ఎం ఉద్యోగుల ప్రతినిధులతో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు.తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

సూర్యాపేట,మన ప్రజాపక్షం
:విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపుతూ ప్రతిభ చాటాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు కే.అనుష, రవితేజ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంఎస్కే ప్రసాద్ క్రికెట్ స్టేడియంలో నారాయణ ప్రీమియర్ గేమ్స్ను వారు ప్రారంభించారు. ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, చెస్, క్యారమ్స్ తదితర క్రీడల్లో 8 టీములు పాల్గొన్నాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విజేతలకు మెమెంటోలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్ రెడ్డి, డీజీఎం రమణ రెడ్డి, ఏజీఎం రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ నవనీత, హరిత, సంజీవ్ కుమార్, నరేష్, దివ్య, సైదులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును కాలరాసే ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
ఏఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మౌన నిరసన

నిర్మల్,మన ప్రజాపక్షం:
ఓటు హక్కును కాలరాసే విధంగా సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని,ఎన్నికల కమిషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మౌన నిరసనలో విద్యార్థి నాయకులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా కార్యదర్శి కైలాష్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించే ప్రమాదం ఉన్న ఎస్ఐఆర్ ప్రక్రియ పట్ల ప్రజల్లో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ఓటరు జాబితాల సవరణ పేరుతో ఒక్క అర్హులైన పౌరుడి ఓటు హక్కు కూడా కోల్పోకూడదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు విలువైనదని, ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని అన్నారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని డిమాండ్ చేశారు.అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని, ఓటు హక్కును కాపాడాలని,ఎస్ఐఆర్ ప్రక్రియపై పునరాలోచన చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్




చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడంలో విఫలమైన జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరారు.ఓటు హక్కు పరిరక్షణ కోసం విద్యార్థి సమాజం, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కైలాష్,అధ్యక్షులు అస్లం నాయకులు వినేష్,అఖిల్, సిద్దు,రమేష్ పాల్గొన్నారు.

ఎల్నినో సమయంలో పేదల పొట్ట కొట్టొద్దు

కొల్లాపూర్ చౌరస్తాలో పేదలకు ఉన్న ఉపాధిని తొలగించొద్దు
పట్టణ సుందరీకరణ పేరుతో నిరుపేదల జీవనోపాధిని దెబ్బతీయడం సరికాదు
బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పృథ్వీరాజ్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తాలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదల ఉపాధిని తొలగించాలనే మున్సిపల్ అధికారుల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం బిఎస్పీ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ కొల్లాపూర్ చౌరస్తాలో ఎస్పీ కార్యాలయం పక్క నుంచి చౌరస్తా వరకు దాదాపు 10 మంది నిరుపేదలు చిన్న చిన్న డబ్బాలు ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరు రోజుకు కేవలం రూ.200 నుంచి రూ.300 వరకు సంపాదించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, అంతేకాకుండా ప్రతిరోజూ రూ.50



నుంచి రూ.100 వరకు తైబజార్ రుసుము కూడా చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేక నిరుపేదలు పట్టణాలకు వలస వస్తున్నారని, మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎల్నినో ప్రభావం ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న ప్రస్తుత తరుణంలో పేదలకు ఉన్న కొద్దిపాటి ఉపాధిని కూడా తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించకపోయినా పర్వాలేదు కానీ, ఇప్పటికే జీవనోపాధి పొందుతున్న పేదల పొట్ట కొట్టడం మాత్రం తగదన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మున్సిపల్ అధికారులకు డబ్బాల సమస్య తప్ప పట్టణంలో పరిష్కరించాల్సిన ఇతర సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నవంబర్ 3వ తేదీలోగా డబ్బాలను తొలగించాలని గడువు విధించడం పేదల పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. పట్టణ సుందరీకరణ పేరుతో నిరుపేదల జీవనోపాధిని దెబ్బతీయడం సరికాదని, పట్టణ అభివృద్ధితో పాటు పేదల ఉపాధికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల ఉపాధికి ఎలాంటి భంగం కలగకుండా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా వారి జీవనోపాధిని తొలగించవద్దని స్పష్టం చేశారు. నిరుపేదలకు అండగా బిఎస్పీ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని, ఈ సమస్యపై కలిసి వచ్చే అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొని సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ను కలిసి పేదల సమస్యను వివరించి న్యాయం చేయాలని కోరుతామని పృథ్వీరాజ్ తెలిపారు.అవసరమైతే పేదల తరపున నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ తాడూరు మండల అధ్యక్షులు జన్ను ఆంజనేయులు, పద్మ, లావణ్య, బాలిశ్వరమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తొలగింపే లక్ష్యంగా ఎస్ఐఆర్ కుట్ర...జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి!

నాగర్‌కర్నూల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు, ఈ నిరసన కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు జగన్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలముల ప్రేమ్ కుమార్ (సింగ్ గురుదేవ్) మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు వెన్నెముక లాంటిదని, ప్రతి అర్హులైన పౌరుడికి ఓటు వేసే హక్కును రాజ్యాంగం కల్పించిందని అన్నారు. అలాంటి ప్రజాస్వామ్య హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం,ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ప్రజల్లో ఆందోళన కలిగించే పరిస్థితులను సృష్టించడం దురదృష్టకరమని విమర్శించారు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయనే అనుమానాలు, ఓటరు జాబితాల్లో చిన్నచిన్న తప్పులు ఉన్నాయనే కారణాలతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే పరిస్థితులు ఏర్పడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ఎన్నికల జాబితాలను సరిదిద్దే పేరుతో నిజమైన ఓటర్ల హక్కులను హరించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు, 2002 నాటి పాత ఓటరు జాబితాల్లో పేర్లు, ఇంటిపేర్ల స్పెల్లింగ్‌లో ఉన్న వ్యత్యాసాలను సాకుగా చూపుతూ ఓటర్లకు నోటీసులు జారీ చేయడం, తాతలు, ముత్తాతల గుర్తింపు పత్రాలను సమర్పించాలని కోరడం సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, వృద్ధులు, నిరక్షరాస్యులు అవసరమైన పత్రాలను సమకూర్చుకోవడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ) ద్వారా నిర్వహించాల్సిన ఈ ప్రక్రియలో తగిన శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకత తప్పనిసరిగా ఉండాలని అన్నారు. సరైన పర్యవేక్షణ లేకుండా ప్రక్రియ కొనసాగితే అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు, దేశవ్యాప్తంగా లక్షలాది మంది అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడితే అది భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత దురదృష్టకరమైన పరిణామమవుతుందని అన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ప్రజల్లో భయాందోళనలు సృష్టించే విధంగా వ్యవహరించడం తగదని విమర్శించారు, కాబట్టి ఎస్ఐఆర్ ప్రక్రియలో చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా తొలగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను, ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు దేశ రాజధాని ఢిల్లీ తో సహా దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో నిరంతరం ఏఐఎస్ఎఫ్ పోరాటం చేస్తుందని, ఈ సమస్యపై విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగన్, సందీప్, మురళి, జ్ఞానేశ్వర్, యశ్వంత్, విజయ్, అరవింద్, శివ, పరమేష్, శివశంకర్, రాజేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్ తర్వాత నియామకాల కోసం జైష్-ఎ-మహమ్మద్ కొత్త ఎత్తుగడ

ఏఐతో ఉగ్రవాద ప్రచారం.. మసూద్ అజార్ పేరుతో డీప్‌ఫేక్ వీడియోలు!

అక్టోబర్ 31, సెంట్రల్ డెస్క్:
ఆపరేషన్ సింధూర్ తర్వాత తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న పాకిస్తాన్ ఆధారిత ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహమ్మద్ యువతను ఆకర్షించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించినట్లు సమాచారం. సంస్థ అధినేత మసూద్ అజార్ బతికే ఉన్నాడని, చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని నమ్మించేందుకు పాత ఆడియో, వీడియోల ఆధారంగా డీప్‌ఫేక్ క్లిప్‌లను రూపొందిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి.భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్తాన్‌లోని బహవల్పూర్‌లో ఉన్న జైష్-ఎ-మహమ్మద్ స్థావరంపై దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సంస్థకు చెందిన



పలువురు కీలక వ్యక్తులు మరణించినట్లు వార్తలు వెలువడ్డాయి. అప్పటి నుంచి మసూద్ అజార్ బహిరంగంగా కనిపించకపోవడంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సంస్థలో కొత్తగా చేరేందుకు యువత ఆసక్తి తగ్గినట్లు కథనం వెల్లడించింది.ఈ నేపథ్యంలో ఏఐతో రూపొందించిన నకిలీ వీడియోల ద్వారా మసూద్ అజార్ ఆరోగ్యంగా ఉన్నట్లు చూపిస్తూ, యువతను సంస్థలో చేరాలని, భారత్‌కు వ్యతిరేకంగా హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడాలని ప్రేరేపించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ తరహా డిజిటల్ ప్రచారంపై భారత భద్రతా సంస్థలు అప్రమత్తమైనట్లు కథనం పేర్కొంది. సామాజిక మాధ్యమాలు, డిజిటల్ నెట్‌వర్క్‌ల ద్వారా ఉగ్రవాద సంస్థలు ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేసే ప్రమాదం పెరుగుతుండటం భద్రతా వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది.

657 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

వారం రోజుల్లో నిర్మాణాలు ప్రారంభించాలి....
100 రోజుల్లో పూర్తి చేయాలి
కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, మన ప్రజాపక్షం:
అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 319 ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 657 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. శనివారం సూర్యాపేటలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, 100 రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు. 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. బేస్‌మెంట్, లింటెల్, రూఫ్ లెవల్ దశల్లో నిర్మాణ పురోగతిని బట్టి విడతల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ప్రతి దశలో నిర్మాణ ఫొటోలను అధికారులకు అందజేయాలని సూచించారు. వచ్చే జనవరి 26 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని కోరారు. ఇందుకు జిల్లా యంత్రాంగం, మున్సిపల్, హౌసింగ్ అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఇళ్ల మంజూరు, నిర్మాణాల్లో అక్రమాలు, అవకతవకలను సహించబోమని హెచ్చరించారు.

పేదల సొంతింటి కల నిజం చేస్తాం

ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్యాద అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీకి 657 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో పథకం అమలవుతోందని చెప్పారు. గతంలో మాజీ మంత్రి దివంగత దామోదర్ రెడ్డి హయాంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో నివసిస్తున్న వారు ఇప్పటికీ సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇళ్లు మంజూరైన వారు కూడా నాణ్యమైన ఇళ్లు నిర్మించుకుని కుటుంబాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఇళ్ల నిర్మాణాలతో మేస్త్రీలు, కూలీలు, పెయింటర్లు, నిర్మాణ సామగ్రి వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని తెలిపారు.సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో కొత్త పెన్షన్ల కోసం సుమారు 3,100 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, అర్హులకు త్వరలో పెన్షన్లు అందిస్తామని వెల్లడించారు. అర్హులైన పేదలు, వృద్ధులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు సర్వోత్తమ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీణరెడ్డి, పిడి హౌసింగ్ జబ్బర్ మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, ఎఎంసి వైస్ చైర్మన్ గట్టు శ్రీను, ఫ్లోర్ లీడర్ వేణు గోపాల్, వెలుగు వెంకన్న కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అక్రమ అరెస్టులు, నోటీసులకు భయపడేది లేదు

ఓటమి భయంతోనే పోలీసులను అడ్డుపెట్టుకుని కక్ష రాజకీయాలు
రుస్తుం మైన్‌తో సంబంధం లేదని ప్రమాణానికి సిద్ధం.. సోమిరెడ్డి సిద్ధమా?
మీడియా సమావేశంలో కన్నీటిపర్యంతమైన వాకాటి దంపతులు

పొదలకూరు,మన ప్రజాపక్షం:
పొదలకూరు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. అక్రమ కేసులు, అరెస్టులు, పోలీసు నోటీసులతో భయపెట్టాలని చూస్తే బెదిరే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పొదలకూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ మాజీ ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులరెడ్డి, బిట్--2 ఎంపీటీసీ అభ్యర్థి వాకాటి సంధ్య, నాయకుడు వాకాటి శివారెడ్డి తదితరులు మాట్లాడారు.

ఎన్నికల్లో పోటీ చేస్తేనే నోటీసులా?: వాకాటి శ్రీనివాసులరెడ్డి

వైఎస్సార్‌సీపీ మాజీ ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తన సతీమణి వాకాటి సంధ్య ఎంపీటీసీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవడంతోనే పోలీసులు నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. ఇన్ని రోజులుగా గుర్తుకురాని అంశాలు ఎన్నికల సమయంలోనే గుర్తుకువచ్చాయా అని ప్రశ్నించారు. తమ కుటుంబంపై



అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తన సోదరుడు వాకాటి శివారెడ్డిని 60 రోజులపాటు జైల్లో ఉంచారని, అయినప్పటికీ అక్రమ అరెస్టులకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందులను వివరిస్తూ శ్రీనివాసులరెడ్డి, ఆయన సతీమణి వాకాటి సంధ్య మీడియా సమావేశంలో కన్నీటిపర్యంతమయ్యారు.

సోమిరెడ్డి.. ప్రమాణానికి సిద్ధమా?: వాకాటి శివారెడ్డి

వైఎస్సార్‌సీపీ నాయకుడు వాకాటి శివారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సోమిరెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. రుస్తుం మైన్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయంపై వినాయకుడి ప్రతిమ ఎదుట కుటుంబసమేతంగా ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రుస్తుం మైన్ నిర్వాహకుల నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోలేదని సోమిరెడ్డి ప్రమాణం చేసేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. తమపై నిరాధార ఆరోపణలు చేస్తూ రాజకీయంగా దెబ్బతీయాలని చూస్తున్నారని మండిపడ్డారు.


మీ తాటాకు చప్పుళ్లకు భయపడం: అంజాద్

వైఎస్సార్‌సీపీ నాయకుడు అంజాద్ మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆశీస్సులు, పొదలకూరు ప్రజలకు వైఎస్సార్‌సీపీపై ఉన్న అభిమానమే తమకు కొండంత అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. దమ్ముంటే పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయకుండా నేరుగా ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని ఎమ్మెల్యే సోమిరెడ్డికి సవాల్ విసిరారు. మీ తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సర్వేపల్లి ప్రజలు మరోసారి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే సోమిరెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని కక్షసాధింపు రాజకీయాలకు తెరతీశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజాబలంతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

పట్టభద్రులారా.. మీ ఓటు హక్కును వినియోగించుకోండి

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పట్టభద్రుడి ఓటు కీలకం
పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు, పట్టభద్రులకు ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి విజ్ఞప్తి
నవంబర్ 6లోగా పట్టభద్రుల ఓటరు నమోదును పూర్తి చేసుకోండి

జనగామ, మన ప్రజాపక్షం:
వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదుకు 2026 నవంబర్ 6 చివరి గడువు అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరూ నిర్ణీత గడువులోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదైన వారు సైతం ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోవద్దని విజ్ఞప్తి చేశారు.పాలకుర్తి నియోజకవర్గంలోని పట్టభద్రులందరూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని, తమ అమూల్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్వినీ రెడ్డి కోరారు.పట్టభద్రుల ఓటు కేవలం ఒక ఎన్నికకే పరిమితం కాదని, విద్యావంతుల అభిప్రాయాలకు, యువత భవిష్యత్తుకు, నిరుద్యోగుల ఆశలకు, సమాజ అభివృద్ధికి ప్రతిబింబమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు ఎంతో విలువ ఉందని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకుని, ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.విద్యావంతులైన పట్టభద్రులు చైతన్యవంతమైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి అన్నారు. విద్య, ఉపాధి, యువతకు అవకాశాలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రాంత అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చే ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రులు చురుకుగా పాల్గొనాలని సూచించారు.పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధితో పాటు విద్యావంతులు, నిరుద్యోగ యువత ఆకాంక్షలకు ప్రాధాన్యత కల్పించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఆమె తెలిపారు. ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును బాధ్యతగా భావించి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.మీ ఓటు మీ హక్కు మాత్రమే కాదు.. మీ భవిష్యత్తును నిర్ణయించే శక్తి కూడా. ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కును వినియోగించుకుని




ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలి" అని ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి కోరారు.

సౌరవ్ దాస్ కుటుంబ నేపథ్యంపై పిల్.. మద్రాస్ హైకోర్టు నోటీసులు

సామాజిక మాధ్యమ ఖాతాల నిలిపివేత, ఆధార్, పాస్‌పోర్టు రద్దుకు పిటిషనర్ విజ్ఞప్తి

అక్టోబర్ 31, సెంట్రల్ డెస్క్:
సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ) సంస్థకు చెందిన సౌరవ్ దాస్ కుటుంబ నేపథ్యంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. కాంచీపురానికి చెందిన వ్యాపారి గణేశ్ కుమార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సౌరవ్ దాస్ కుటుంబ మూలాలు నేపాల్‌కు చెందినవని పిటిషనర్ ఆరోపిస్తూ, ఈ అంశంపై సంబంధిత అధికారులు విచారణ జరపాలని కోరారు.విచారణ పూర్తయ్యే వరకు సౌరవ్ దాస్‌కు చెందిన సామాజిక మాధ్యమ ఖాతాలను



నిలిపివేయాలని, ఆయన ఆధార్, పాస్‌పోర్టులను రద్దు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన మద్రాస్ హైకోర్టు సౌరవ్ దాస్, ఆయన కుటుంబ సభ్యులు, కేంద్ర ప్రభుత్వం, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలకు నోటీసులు జారీ చేసింది.అయితే, కుటుంబ మూలాలపై వచ్చిన ఆరోపణలు పిటిషనర్ చేసినవే తప్ప, అవి నిర్ధారణ అయినట్లు కాదు. నోటీసులు జారీ చేయడం కూడా ఆరోపణలను న్యాయస్థానం సమర్థించినట్లు కాదని స్పష్టం చేయాల్సి ఉంది. సంబంధిత పక్షాల సమాధానాలు, తదుపరి విచారణలో కోర్టు వెలువరించే ఆదేశాలపై ఈ వ్యవహారంలో తదుపరి పరిణామాలు ఆధారపడి ఉంటాయి.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు ఘన నివాళి అర్పించిన డిసిపి రాజమహేంద్ర నాయక్



జనగామ, మన ప్రజాపక్షం: స్వతంత్ర భారత తొలి హోంశాఖ మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జనగామలోని కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి డిసిపి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ భారతదేశ సమగ్రత, ఐక్యత కోసం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేసిన సేవలు అపారమని కొనియాడారు. సంస్థానాల విలీనంతో దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చిన మహనీయుడని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ?దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై దేశ ఐక్యతకు కట్టుబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని సర్దార్ పటేల్‌కు నివాళులర్పించారు.



ఉమ్మడి వరంగల్ జిల్లా స్వేరో ఆత్మీయ సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ

జనగామ ప్రతినిధి, మన ప్రజాపక్షం:
స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ పరిధిలో, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నవంబర్ 22న జరగబోయే "స్వేరో ఆత్మీయ సమ్మేళన" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా ప్రత్యేక పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య తమ చేతుల మీదుగా ఆవిష్కరించి, సమ్మేళనం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ?ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రోగ్రామ్ కన్వీనర్ కలకోట రజినీకాంత్ స్వేరో, జనగామ జిల్లా కమిటీ ఇంచార్జ్ గాదె రజిత స్వేరో, జఫర్గడ్ మండల కన్వీనర్ కలకోటి మనోహర్, కో కన్వీనర్ ఇల్లందుల రాజు, చిల్పూర్ మండల కన్వీనర్ ఎడ్ల మహిపాల్, రఘునాథ్ పల్లి మండల కన్వీనర్ ప్రేమ్ కుమార్, ఘన్‌పూర్ మండల కన్వీనర్ బొంకూర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.?అలాగే ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మారపల్లి ప్రసాద్, సీనియర్ స్వేరోలు ఇసురం శ్రీనివాస్, యాటాల ప్రశాంత్ స్వేరో మరియు ఇతర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.?ఈ ఆత్మీయ సమ్మేళనానికి స్వేరో కుటుంబ సభ్యులందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.



జనగామ సబ్ జైలు, బాలికల హోమ్‌లో న్యాయ అవగాహన కార్యక్రమాలు

ఖైదీల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శంకర శ్రీదేవి

జనగామ, మన ప్రజాపక్షం:
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జనగామ ఆధ్వర్యంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శంకర శ్రీదేవి జనగామ సబ్ జైలును, బాల సదన్ బాలికల హోమ్‌ను సందర్శించి న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.జనగామ సబ్ జైలులో ఉన్న విచారణ ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోక్సో చట్టం--2012, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ఖైదీలకు ఉన్న చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి ఖైదీకి న్యాయవాది ఉండే హక్కు ఉందని, న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.అనంతరం బాల సదన్ బాలికల హోమ్‌ను సందర్శించిన శంకర శ్రీదేవి బాలికలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. అపరిచితులకు దూరంగా ఉండాలని, ఎవరైనా పాఠశాల నుంచి అనుసరిస్తున్నా, అనుమానాస్పదంగా ప్రవర్తించినా లేదా అనవసరంగా అధిక శ్రద్ధ చూపించినా వెంటనే హోమ్ సూపరింటెండెంట్,ఉపాధ్యాయులు లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని సూచించారు.బాలికలు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆమె సూచించారు.

డోర్నకల్ రూరల్ మండల బీజేపీ నూతన కార్యవర్గం ఏర్పాటు

కన్వీనర్‌గా దేవావత్ హనుమంతు, జనరల్ సెక్రటరీగా వినోద్ నియామకం

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి: లఖన్ వ్యాస్

అక్టోబర్ 31
(మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి):



భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా డోర్నకల్ రూరల్ మండల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మండల కన్వీనర్‌గా దేవావత్ హనుమంతును, జనరల్ సెక్రటరీగా వినోద్‌ను నియమించినట్లు పార్టీ నాయకులు ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, మానుకోట జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు దిశానిర్దేశం మేరకు, జిల్లా జనరల్ సెక్రటరీలు చీకటి మహేష్, మదన్ నాయక్ ఆధ్వర్యంలో డోర్నకల్ బీజేపీ కార్యాలయంలో నియామకాలు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థాయిలో పార్టీని విస్తరించాలని నాయకులు సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ మానుకోట జిల్లా కౌన్సిల్ సభ్యుడు లఖన్ వ్యాస్ మాట్లాడుతూ, కార్యకర్తలంతా వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా ఐక్యంగా పనిచేసి పార్టీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు పొందిన హనుమంతు, వినోద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



నీటి సంరక్షణపై చీకుర్తి గ్రామస్తుల ప్రతిజ్ఞ

ప్రతి నీటి బొట్టును కాపాడుకుందాం..

భవిష్యత్ తరాలకు నీటి సంపదను అందిద్దాం

న్యాల్కల్, అక్టోబర్ 31:
సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం చీకుర్తి గ్రామంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో జల మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ప్రాముఖ్యత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలని, వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా భూమిలోకి ఇంకేలా ప్రతి ఒక్కరూ తగిన చర్యలు తీసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో నీటి వనరుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు, సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు రామకృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, వినయ్‌కుమార్, గుడాడే జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తుకారాం, ఎక్కం శ్రీనివాస్‌రెడ్డి, కిష్టారెడ్డి, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నీటి సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలని వారు కోరారు.



పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ మహేందర్ రెడ్డికి ఘన వీడ్కోలు

మహేందర్ రెడ్డి పోలీస్ శాఖకు అందించిన సేవలు అభినందనీయం: ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కారం

అక్టోబర్ 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :
పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేసిన అధికారులు శాఖకు గర్వకారణమని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ పేర్కొన్నారు. నారాయణపూర్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన మహేందర్ రెడ్డికి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డిని ఎస్పీ శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ?ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలం పాటు నిబద్ధతతో విధులు నిర్వర్తించిన మహేందర్ రెడ్డి సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పాల్గొన్న అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మహేందర్ రెడ్డి చూపిన క్రమశిక్షణ, అంకితభావం తోటి సిబ్బందికి ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖ తరపున ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐకెఎస్ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి


నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

వ్యవసాయం, విద్యా రంగం ప్రైవేటుకరణ వెనక్కి తీసుకోవాలి



జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా అఖిల భారత కిసాన్ సభ,భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కమిటీల సంయుక్త సమావేశంప్రజా సంఘాల కార్యాలయంలో జరిగింది.ఏఐకెఎస్ జిల్లా అధ్యక్షులు రావర్తి సోమయ్య,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పొదల లవకుమార్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఏఐకెఎస్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు భూక్యా చందు నాయక్, దాసగాని సుమ మాట్లాడుతూ నవంబర్ 15, 16, 17, 18 తేదీలలో నల్లగొండలో జరగనున్న ఏఐకెఎస్ 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.దేశ అభివృద్ధిలో వ్యవసాయ రంగం పాత్ర, ప్రభుత్వ విధానాలు, వాటి పర్యవసానాలు, రైతుల కర్తవ్యం అనే ప్రధాన అంశంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో, కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని ఈ వ్యాసరచన పోటీలకు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంచుతూనే వ్యవసాయ రంగం ఈ దేశానికి జీవనాధారం అనే సందేశం విద్యార్థులకు అర్థం చేయించడం కోసం ఈ జాతీయ మహాసభలు పురస్కరించుకొని నిర్వహించబడుతున్నాయని తెలిపారు. 1936లో ఆవిర్భవించిన అఖిల భారత కిసాన్ సభ 90 సంవత్సరాలుగా రైతుల హక్కుల కోసం పోరాడుతోందని పేర్కొన్నారు.నవంబర్ 15న లక్షలాది మంది రైతులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా జాతీయ రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మహిళా సంఘాల నాయకులు పాల్గొననున్నారని వెల్లడించారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలపై సమగ్రంగా చర్చించి, రైతుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలని, రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని, రైతు సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ నుంచి కాపాడాలని, పేద విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థులు, యువజనులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.జనగామ జిల్లా వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నవంబర్ 15న నల్లగొండలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభతో పాటు ఏఐకెఎస్ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకెఎస్,ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీల తరుపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మోకు కనకారెడ్డి,సీఐటియూ జిల్లా అధ్యక్షులు రావర్తి రాజు,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ నరేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాపురం మహేందర్ ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సాత్విక్, నాయకులు రమేష్, నిఖిల్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధాలు లేని జీవితానికి ఆరోగ్యకరమైన అలవాట్లే పునాది!



జనగామ, మన ప్రజాపక్షం:
ప్రశాంతమైన మనసు.. క్రమబద్ధమైన జీవనశైలి.. ఆహ్లాదకరమైన వాతావరణం.. ఆరోగ్యానికి సహజ మార్గాలు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది పని ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో సతమతమవుతున్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే మందులపై ఆధారపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే మన దైనందిన జీవితంలో కొన్ని మంచి అలవాట్లను భాగం చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. ప్రకృతికి దగ్గరగా జీవించడం, మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం మన ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి.

క్రమబద్ధమైన జీవనశైలితో ఆరోగ్యం
సరైన సమయంలో నిద్రపోవడం, ఉదయాన్నే మేల్కొనడం శరీరానికి అవసరమైన విశ్రాంతిని అందిస్తాయి. ప్రతిరోజూ తగినంత నిద్రపోవడం వల్ల శరీరం చురుకుగా ఉండటంతోపాటు ఏకాగ్రత కూడా పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం నడక, యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి అలవాట్లు శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు తోడ్పడతాయి. వీలైనంత సమయం ప్రకృతి ఒడిలో గడపడం, ఉదయపు సూర్యకాంతిని ఆస్వాదించడం కూడా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగమే.

ఆహారపు అలవాట్లే ఆరోగ్యానికి పునాది
మన ఆరోగ్యంలో ఆహారానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, ఆహారాన్ని నెమ్మదిగా బాగా నమిలి తినడం, తగినంత నీరు తాగడం వంటి అలవాట్లు జీర్ణక్రియకు సహాయపడతాయి. భోజనం చేసిన తర్వాత కొద్దిసేపు నిటారుగా కూర్చోవడం, శరీరానికి అనుకూలంగా ఉంటే వజ్రాసనంలో కూర్చోవడం కొందరికి ఉపశమనం కలిగించవచ్చు. అయితే ప్రతి ఒక్కరికీ ఇది తప్పనిసరి కాదు. ఉపవాసం అన్ని వ్యాధులకు పరిష్కారం కాదు. ముఖ్యంగా మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు వైద్యుల సలహా లేకుండా ఉపవాసాలు చేయకూడదు. ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అందేలా ఆహారం తీసుకోవడం ముఖ్యం. నవ్వు.. సంతోషం.. మనశ్శాంతి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి. చిన్న చిన్న విషయాలకు ఆందోళన చెందకుండా, జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవడం అలవాటు చేసుకోవాలి. కుటుంబ సభ్యులతో సమయం గడపడం, స్నేహితులతో మాట్లాడటం, సరదాగా నవ్వుకోవడం, మనసుకు నచ్చిన పనులు చేయడం ఒత్తిడిని తగ్గించుకోవడానికి సహాయపడతాయి.కొన్నిసార్లు మౌనంగా ఉండటం, మన ఆలోచనలను ప్రశాంతంగా పరిశీలించుకోవడం కూడా మానసిక సమతుల్యతకు దోహదపడుతుంది. ప్రార్థన, మంత్రజపం, ధ్యానం వంటి ఆచరణలు వ్యక్తిగత విశ్వాసాలకు అనుగుణంగా మనసుకు ప్రశాంతతను అందించవచ్చు.

మంచి సంబంధాలే మనసుకు బలం
మన జీవితంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయుల పాత్ర ఎంతో ముఖ్యమైనది. కష్టసమయంలో మనకు అండగా నిలిచే వ్యక్తులు మానసిక ధైర్యాన్ని అందిస్తారు. ఇతరులకు సహాయం చేయడం, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం, ప్రేమతో మాట్లాడటం, కృతజ్ఞతాభావంతో జీవించడం మనసుకు సంతృప్తిని ఇస్తాయి.నిస్వార్థంగా ఇతరులకు మేలు చేయడం, అందరితో స్నేహపూర్వకంగా మెలగడం, ఉన్నదానితో సంతృప్తి చెందడం వంటి లక్షణాలు జీవితాన్ని మరింత అర్థవంతంగా మారుస్తాయి. మంచి స్నేహితులు మనకు విలువైన ఆత్మీయ సంపద. అయితే మనశ్శాంతి కోసం అవసరమైనప్పుడు వ్యక్తిగత హద్దులను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం.

ప్రకృతిని ప్రేమిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం
ప్రకృతి మనిషికి ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది. స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించడం, చెట్ల మధ్య నడవడం, మొక్కలను పెంచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం మనలో సానుకూల భావాలను పెంపొందిస్తాయి. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, మనకు లభించిన జీవితానికి కృతజ్ఞతతో ఉండటం మనసుకు ఆనందాన్ని ఇస్తుంది.ప్రతి రోజును కొత్త అవకాశంగా భావించి, చిన్న చిన్న సంతోషాలను ఆస్వాదించాలి. పనుల్లో చురుకుగా ఉండటంతోపాటు శరీరానికి తగిన విశ్రాంతి ఇవ్వాలి. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, కుటుంబంతో ఆనందంగా గడపాలి.

ఆరోగ్యకరమైన అలవాట్లే నిజమైన సంపద
నిద్ర, వ్యాయామం, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ప్రశాంతత, ఆత్మీయ సంబంధాలు మన జీవితాన్ని మెరుగుపరిచే ముఖ్యమైన అంశాలు. వీటిని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించవచ్చు.అయితే మంచి అలవాట్లు వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కావు. అనారోగ్యం కలిగినప్పుడు వైద్యులను సంప్రదించి అవసరమైన చికిత్స తీసుకోవాలి. సూచించిన మందులను వైద్యుల సలహా లేకుండా ఆపకూడదు.మందులపై మాత్రమే ఆధారపడకుండా, ఆరోగ్యకరమైన అలవాట్లను జీవితంలో భాగం చేసుకుందాం.మనశ్శాంతిని పెంపొందించుకుందాం. ప్రకృతిని ప్రేమిద్దాం. ఇతరులకు సహాయం చేస్తూ, మనతోపాటు మన చుట్టూ ఉన్నవారి జీవితాల్లోనూ ఆనందాన్ని నింపుదాం. ఎందుకంటే ఆరోగ్యకరమైన జీవనశైలే సంతోషకరమైన జీవితానికి బలమైన పునాది!


యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని

దర్శించుకున్న గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

తెలంగాణ వేద విద్వాన్ మహాసభ 26వ వార్షికోత్సవంలో పాల్గొన్న గవర్నర్, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

వేద పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు-మంత్రి శ్రీధర్ బాబు

భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి-వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్



జనగామ,మన ప్రజాపక్షం:
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా పర్యటించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తెలంగాణ వేద విద్వాన్ మహాసభ 26వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, టీపీసీసీ సభ్యులు, వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేద పండితులు, వేద విద్యార్థులతో కలిసి వార్షికోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేద విద్య ప్రాముఖ్యత, వేద సంప్రదాయాల పరిరక్షణ, వేద విద్యాభివృద్ధిపై కార్యక్రమంలో చర్చించారు. వేద పాఠశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.గవర్నర్ పర్యటన అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మంత్రి శ్రీధర్ బాబు, వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్టలోని వేద పాఠశాలను మరింత అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ మాట్లాడుతూ ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో కల్యాణ మండపం, టెంపుల్ ఆర్చ్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. యాదగిరిగుట్టకు విచ్చేసే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.


ఇస్రో మరో విజయం.. నింగిలోకి ఎన్వీఎస్-03 ఉపగ్రహం

నావిక్ సేవల విస్తరణే లక్ష్యం.. జీఎస్ఎల్వీ-ఎఫ్18 ద్వారా విజయవంతమైన ప్రయోగం

అక్టోబర్ 31,సెంట్రల్ బ్యూరో:
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని సాధించింది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్ సామర్థ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో రూపొందించిన ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా శుక్రవారం రాత్రి 11.51 గంటలకు ఉపగ్రహాన్ని నింగిలోకి పంపించారు. ఈ ప్రయోగంతో దేశీయ ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఇస్రో ముందడుగు వేసింది.సుమారు 2,250 కిలోల బరువున్న ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని మూడు దశల జీఎస్ఎల్వీ రాకెట్ భూ బదిలీ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అనంతరం ఉపగ్రహంలోని ఇంజిన్ల సాయంతో నిర్దేశిత కక్ష్యలోకి చేరుకోనుంది. ఈ ఉపగ్రహంలో భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అణు గడియారాన్ని అమర్చారు. దీనివల్ల అత్యంత కచ్చితమైన సమయ సమాచారం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్-బ్యాండ్ సిగ్నళ్లతో పాటు ఎల్1 నావిగేషన్ సిగ్నల్ కూడా అందుబాటులోకి రావడం ప్రత్యేకత.నావిక్ వ్యవస్థ ద్వారా భారత భూభాగంతో పాటు దేశ సరిహద్దుల చుట్టూ సుమారు 1,500 కిలోమీటర్ల పరిధిలో నావిగేషన్ సేవలు అందించేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. రవాణా, సముద్రయానం, పౌర విమానయానం, రక్షణ రంగాలకు ఇది ప్రయోజనకరంగా మారనుంది. ముఖ్యంగా సైనిక కార్యకలాపాలు, వ్యూహాత్మక అవసరాలకు కచ్చితమైన స్థాన నిర్ధారణ, సమయ సమాచారం అందించడంలో నావిక్ వ్యవస్థ కీలక పాత్ర పోషించనుంది.



సుకేశ్ కేసు: నటి నోరా ఫతేహీకి ఢిల్లీ హైకోర్టు సమన్లు



బాలీవుడ్ నటి, డ్యాన్సర్ నోరా ఫతేహీకి ఢిల్లీ హైకోర్టు సమన్లు జారీ చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుకేశ్ చంద్రశేఖర్ రూ. 200 కోట్ల మనీలాండరింగ్, దోపిడీ కేసులో ప్రాసిక్యూషన్ తరపున సాక్షిగా హాజరుకావాలని ఆదేశించింది. నవంబర్ 2న వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి దాఖలు చేసిన మూడో అనుబంధ ఛార్జిషీట్‌లో నోరా ఫతేహీని ప్రాసిక్యూషన్ విట్నెస్ గా చేర్చారుసీనియర్ అధికారులమంటూ బెదిరింపులకు పాల్పడిన సుకేశ్ చంద్రశేఖర్... 2020-21 మధ్య ఢిల్లీలోని రోహిణి జైలు నుంచే ఓ పెద్ద దోపిడీ రాకెట్‌ను నడిపినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. రాన్‌బాక్సీ మాజీ ప్రమోటర్ శివిందర్ మోహన్ సింగ్ భార్య అదితి సింగ్‌ను టార్గెట్ చేసి, జైలులో ఉన్న ఆమె భర్తను విడిపిస్తానని నమ్మించి ఆమె నుంచి దాదాపు రూ. 200 కోట్లు వసూలు చేశాడనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం విచారణ జరిపి... మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ కింద అభియోగాలు నమోదు చేసింది.ఈ కేసు విచారణలో భాగంగా గతంలోనే ఆర్థిక నేరాల విభాగం అధికారులు నోరా ఫతేహీని సుదీర్ఘంగా ప్రశ్నించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద ఆమె వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. తనకు సుకేశ్‌తో నేరుగా పరిచయం లేదని, అతని భార్య లీనా మరియా పాల్ ద్వారానే మాట్లాడానని నోరా అధికారులకు తెలిపారు. 2020 డిసెంబర్‌లో చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి కేవలం వృత్తిపరంగానే హాజరయ్యానని ఆమె వివరించారు.

ఐదో టీ20కి దినేశ్ కార్తీక్ కొత్త ప్లాన్..సంజూ, వైభవ్ ఇద్దరికీ చోటు!

న్యూజిలాండ్‌తో ఐదో టీ20లో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి అవకాశం కల్పించేందుకు సంజూ శాంసన్‌ను పక్కన పెట్టాల్సిన అవసరం లేదని భారత మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ సూచించాడు. వైభవ్‌ను ఆడించాలనుకుంటే అభిషేక్ శర్మకు విశ్రాంతినివ్వాలని అభిప్రాయపడ్డాడు. సిరీస్‌ను భారత్ ఇప్పటికే కైవసం చేసుకున్న నేపథ్యంలో ఆటగాళ్లకు విశ్రాంతినిస్తూ జట్టులో మార్పులు చేయవచ్చని పేర్కొన్నాడు.క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ కార్తీక్ ఈ సూచన చేశాడు. “వైభవ్ ఆడాలని అందరూ కోరుకుంటున్నారు. అతడికి అవకాశం ఇవ్వాలంటే అభిషేక్‌కు విశ్రాంతి ఇవ్వాలి. వైభవ్ గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ సంజూనే ఎందుకు తప్పించాలి? అభిషేక్‌కు కూడా విశ్రాంతి ఇవ్వొచ్చు. ఇక్కడ కీలకమైన విషయం విశ్రాంతి మాత్రమే” అని కార్తీక్ అన్నాడు.బౌలింగ్ విభాగంలోనూ మార్పులు చేయాలని కార్తీక్ సూచించాడు. అక్షర్ పటేల్‌ను కొనసాగిస్తూ అర్ష్‌దీప్ సింగ్‌కు విశ్రాంతినివ్వవచ్చని చెప్పాడు. అతడి స్థానంలో మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్‌లకు అవకాశం కల్పించవచ్చని అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌లో అర్ష్‌దీప్ అద్భుతంగా బౌలింగ్ చేశారని, పరిస్థితులను బట్టి అదనపు స్పిన్నర్‌ను పరీక్షించవచ్చని పేర్కొన్నాడు.గాయంతో ఇషాన్ కిషన్ రెండు, మూడో టీ20లకు దూరం కావడంతో వైభవ్‌కు జట్టులో చోటు దక్కింది. మూడో మ్యాచ్‌లో 19 బంతుల్లో 45 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. ఇషాన్ కోలుకుని తిరిగి రావడంతో నాలుగో టీ20లో వైభవ్‌కు అవకాశం దక్కలేదు. ఐదో టీ20



నవంబర్ 1న హామిల్టన్‌లో జరగనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 3-1తో ఆధిక్యంలో ఉంది.

SPORTS

వన్డేల్లో జడేజా కథ ముగిసినట్టేనా? పుజారా కీలక వ్యాఖ్యలు



భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా వన్డే భవిష్యత్తుపై మాజీ క్రికెటర్లు చతేశ్వర్ పుజారా, అభిషేక్ నాయర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల వన్డే సిరీస్‌లకు జడేజాను ఎంపిక చేయకపోవడంతో వచ్చే ఏడాది జరగనున్న ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కుతుందా? అనే చర్చ మొదలైంది.న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు వన్డేల సిరీస్‌కు 37 ఏళ్ల జడేజాను ఎంపిక చేయలేదు. ఎడమచేతి వాటం స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు జట్టు యాజమాన్యం తొలి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో వన్డేల్లో జడేజా ప్రయాణం ముగిసినట్లేనని పుజారా అభిప్రాయపడ్డాడు. జడేజాను వన్డేల్లో కొనసాగించాలని భావిస్తే న్యూజిలాండ్ సిరీస్‌కు ఎంపిక చేసేవారని అన్నాడు. అక్షర్‌కు ఎక్కువ అవకాశాలు ఇస్తున్నందున జడేజాకు ఈ విషయాన్ని ముందుగానే చెప్పి ఉండొచ్చని పేర్కొన్నాడు.జడేజా వయసును దృష్టిలో ఉంచుకుని టెస్టు క్రికెట్‌పైనే దృష్టి పెట్టాలని జట్టు యాజమాన్యం సూచించి ఉండొచ్చని పుజారా తెలిపాడు. ఇప్పటికే టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అతడికి వన్డేల్లోనూ అవకాశాలు తగ్గే సూచనలు ఉన్నాయని జియోస్టార్ కార్యక్రమంలో వ్యాఖ్యానించాడు.మరోవైపు అభిషేక్ నాయర్ మాత్రం జడేజాకు ప్రపంచకప్ జట్టులో అవకాశం ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. అక్షర్ పటేల్ గాయపడితే అతడి స్థానంలో జడేజానే ముందుగా గుర్తుకొస్తాడని చెప్పాడు. అక్షర్ తర్వాత జడేజా భారత జట్టుకు 'ఇన్సూరెన్స్ పాలసీ'లా ఉంటాడని పేర్కొన్నాడు. ప్రపంచకప్‌కు ముందు అక్షర్‌కు ఏదైనా జరిగితే జడేజాను జట్టులోకి తీసుకునే అవకాశముందని నాయర్ అన్నాడు.నవంబర్ 4 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న ప్రపంచకప్‌కు ముందు జట్టు కూర్పును పరీక్షించుకునేందుకు ఈ సిరీస్ కీలకం కానుంది.

భారత మహిళా క్రికెట్‌కు 50 ఏళ్లు.. నాటి కష్టాలను గుర్తుచేసుకున్న శుభాంగి కులకర్ణి

భారత మహిళా క్రికెట్ చరిత్రలో శనివారం ఒక సువర్ణాధ్యాయం. సరిగ్గా 50 ఏళ్ల క్రితం, 1976 అక్టోబర్ 31న, భారత మహిళల జట్టు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో వెస్టిండీస్‌తో తమ మొట్టమొదటి అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ ఆడింది. ఆ చారిత్రక మ్యాచ్‌లో భాగమైన మాజీ కెప్టెన్, లెజెండరీ స్పిన్నర్ శుభాంగి కులకర్ణి, ఈ స్వర్ణోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని ఆనాటి జ్ఞాపకాలను 'బీసీసీఐ.టీవీ'తో పంచుకున్నారు."ఆ రోజు డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఎంతో ఉత్సాహంగా ఉన్నాం. మాలో చాలామంది 17-18 ఏళ్ల వయసున్న కాలేజీ అమ్మాయిలమే. అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నామన్న ఆనందం మాటల్లో చెప్పలేనిది" అని శుభాంగి గుర్తుచేసుకున్నారు. కేవలం 17 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన ఆమె, ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లోనే 48 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించారు.అయితే, ఆ ప్రయాణం పూలపాన్పు కాదని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నామని ఆమె తెలిపారు. "అప్పట్లో క్రికెట్ ఆడటానికి ఇంట్లో అనుమతి తీసుకోవడమే పెద్ద సవాల్. గాయాలవుతాయని, ఎండలో ఆడితే నల్లబడిపోతామని తల్లిదండ్రులు భయపడేవారు. దేశవాళీ టోర్నీలకు సొంత డబ్బులు ఖర్చుపెట్టుకుని, కొన్నిసార్లు రిజర్వేషన్ లేని రైలు బోగీల్లో ప్రయాణించేవాళ్లం" అని ఆనాటి కష్టాలను వివరించారు.మహిళా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూసీఏఐ) కార్యదర్శిగా, 2006లో దానిని బీసీసీఐలో విలీనం చేయడంలో శుభాంగి కీలక పాత్ర పోషించారు. శరద్ పవార్ సహకారంతో జరిగిన ఈ విలీనమే మహిళా క్రికెట్ దశను మార్చిందని ఆమె అభిప్రాయపడ్డారు. "ఆ విలీనం తర్వాతే అమ్మాయిలకు మెరుగైన సౌకర్యాలు అందడం మొదలైంది. నాటి మా కష్టాలతో పోలిస్తే, నేటి తరానికి బీసీసీఐ అద్భుతమైన వసతులు కల్పిస్తోంది. ఫైవ్-స్టార్ హోటళ్లలో బస, విమాన ప్రయాణాలు, టాప్-క్లాస్ గ్రౌండ్స్ చూస్తుంటే గర్వంగా ఉంది" అని ఆమె



అన్నారు. ముఖ్యంగా సమాన మ్యాచ్ ఫీజులు, సెంట్రల్ కాంట్రాక్టులు, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రాకతో క్రీడాకారుల భవిష్యత్తుకు పూర్తి భరోసా లభించిందని హర్షం వ్యక్తం చేశారు.గతేడాది భారత జట్టు తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలవడం తమలాంటి మాజీ క్రీడాకారుల కల నెరవేరిన క్షణమని శుభాంగి ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే 2027లో తొలిసారిగా మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం ఇవ్వనుండటం సరైన నిర్ణయమని, ఇది మహిళా క్రికెట్ అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.